

బతుకమ్మతో ఉద్యోగిని

బతుకమ్మ తెలంగాణ సంస్కృతి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు వారసత్వంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ మహిళా సంఘాలకు బహుమతులు ప్రదానం చేశారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బతుకమ్మ ఆడి సందడి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, బావయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న ఐకేపీ మహిళలు



వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

మనసెరిగి మసులుకుందాం

నేడు మానసిక ఆరోగ్య దినోత్సవం



★ **బాల్యం :** అతిగా ఫోన్ల వాడకం, అతి క్రమశిక్షణ వంటివి బాలల్లో మానసిక సమస్యలకు దారి తీస్తున్నాయి. రకరకాల భయాలు, నిద్రలేమి, ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, పక్క తడపడం, అల్లరి, ప్రవర్తనా లోపాలు తలెత్తుతున్నాయని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

★ **విద్యార్థులు:** విద్యార్థులపై సామర్థ్యానికి మించిన అంచనాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల అతి వాడకం, కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు లేకపోవడం, పర్యవేక్షణలేమి, నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టడం వంటివి వారి మానసిక ఒత్తిడికి కారణమవుతున్నాయి.

★ **యువత:** టీనేజీలో హార్మోన్ల ప్రభావంతో కాస్త దూకుడుగా, మనసుకు నచ్చినట్లు జీవించడానికి ప్రయత్నిస్తారు. లైంగిక కోరికలు, మత్తుకు బానిస, దూకుడు స్వభావంతో చిక్కుల్లో పడటం వంటివి వారిని కుంగదీస్తున్నాయి.

★ **వివాహితులు:** వైవాహిక జీవితంలో ఆర్థిక, సామాజిక పరిస్థితులకు తగ్గట్టు జీవించే క్రమంలో భార్యాభర్తల మధ్య ఏర్పడే వివాదాలు ఒత్తిడికి గురి చేస్తున్నాయి. విడాకులకూ దారి తీస్తున్నాయి.

★ **వృద్ధులు:** నిరాదరణకు గురవడం, సరైన పోషణ లేకపోవడం, ఒంటరితనం వంటివి వృద్ధుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నాయి.

న్యూస్‌టుడే, బోధన్ పట్టణం

మానసిక వేదన మనిషిని చెద పురుగులా తినేస్తుందంటారు పెద్దలు. అది వాస్తవమేనని మానసిక వైద్యులు చెబుతుంటారు. నిత్యం కుంగుబాటుకు గురయ్యే వారు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా అక్టోబరు 10న 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' నిర్వహిస్తోంది.

మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మానసిక రుగ్మతలకు కారణమవుతోంది. శరీర గాయానికి ఔషధం రాస్తే తగ్గిపోతుంది. కానీ మనసుకైన గాయానికి ధైర్యం, ఆత్మవిశ్వాసం, అనుబంధాలే దివ్యౌషధం. డిజిటల్ యుగంలో మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వయసుల వారీగా సమస్యలకు కారణాలు వేరైనా... మానసికంగా మాత్రం కుంగిపోతున్నారు. వివిధ కారణాలతో బలవన్మరణాలకు పాల్పడుతుంటారు.

జిల్లాలో ఆత్మహత్యల గణాంకాలు...

★ 2021 - 355 ★ 2022 - 339 ★ 2023 - 345

ఒత్తిడితో జీవన శైలి వ్యాధుల బాధితులు

వ్యాధి	నిజామాబాద్	కామారెడ్డి
రక్తపోటు	75,068	68,752
మధుమేహం	34,476	44,654



ఇందూరులో పరిస్థితి...

ఉమ్మడి జిల్లాలో దాదాపు ఆరుగురు మానసిక వైద్య నిపుణులున్నారు. వారి వద్ద సగటున రోజుకు 40-50 మంది మానసిక రుగ్మతలతో చికిత్సకు వెళుతున్నారు. కానీ, కొంతమంది బయటకు చెప్పుకోలేక పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అందుకే జిల్లాలో మానసిక ఆరోగ్యం, చికిత్సపై విస్తృత అవగాహన పెంపొందించాల్సిన అవసరముంది. లేదంటే ఎదురయ్యే పరిణామాలకు కొన్ని ఉదాహరణలు.

● బోధన్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ప్రైవేటులో ఉద్యోగం చేశారు. కాలక్రమంలో కుటుంబంలో జరిగిన ఘటనతో కుంగుబాటుకు గురై చివరకు మానసిక అనారోగ్యంతో తనలో తాను మాట్లాడుకోవడం, ఒంటరిగా జీవించడం అలవర్చుకున్నాడు.

● జిల్లాకు చెందిన ఓ మహిళ కుటుంబ పరిస్థితులతో కుంగుబాటుకు గురైంది. మెదడుపై తీవ్ర ప్రభావం చూపడంతో మానసిక ఆరోగ్యం దెబ్బతింది. తాను ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో తెలియడం లేదు.

● జిల్లాకు చెందిన మరో యువకుడు విద్యావంతుడు. కానీ చదువుపైనే అధికంగా దృష్టి సారించి కుటుంబ, సామాజిక బంధాలు లేక ఒంటరిగా ఎక్కువగా గడుపుతున్నాడు. చివరకు ఆయనలో బాల్య దశ లక్షణాలు ఆవరించాయి.

● జిల్లాకు చెందిన ఒక వృద్ధురాలి పిల్లలంతా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఊళ్లోనే ఉండాలని భావించి ఒంటరిగా జీవించింది. మతిమరపు పెరిగి ఎవరినీ గుర్తు పట్టలేక చివరికి మంచం పట్టింది.

సకాలంలో వైద్యం చేయించుకోవాలి

మనిషి పైకి బాగానే కనిపించినా మానసికంగా ఆరోగ్యంగా లేకపోతే సాధారణ జీవనం గడపడం కష్టం. ఇతర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఇటీవల ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలపై కొంత అవగాహన పెరిగి చికిత్సకు ముందుకొస్తున్నారు. చికిత్స కౌన్సెలింగ్‌తో వారిని సాధారణ స్థితికి తీసుకురావొచ్చు. **- డా.విశాల్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



పురపాలికగా బిచ్కుంద..!

పట్టణాభివృద్ధి శాఖకు చేరిన ప్రతిపాదనలు

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, బిచ్కుంద

జుక్కల్ నియోజకవర్గ కేంద్రంగా ఉన్న బిచ్కుంద మండల కేంద్రాన్ని పురపాలికగా మార్చేందుకు రంగం సిద్ధమవుతోంది. కలెక్టర్ ఆమోదం పొందిన ప్రతిపాదన దస్త్రాన్ని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి పంపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం బిచ్కుంద పట్టణ జనాభా 13,213 ఉండగా.. ప్రస్తుతం 17,480గా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు. 15 వేలకు మించి జనాభా ఉండడంతో పురపాలికగా మార్చే ప్రతిపాదనకు ఆమోదం లభించే అవకాశాలున్నట్లు తీరుపై కథనం.



బిచ్కుంద మండలకేంద్రం

పరిశీలనకు ప్రత్యేక బృందం

● ప్రస్తుతం గ్రామపంచాయతీగా ఉన్న బిచ్కుంద ఆదాయ, వ్యయాల పరిశీలనకు పట్టణాభివృద్ధిశాఖ చెందిన ప్రత్యేక బృందం త్వరలో పర్యటించనుంది. మండల కేంద్రంలోని భౌతిక వసతులు, ఇతర సౌకర్యాలు, ఆదాయ పెంపునకు ఉన్న మార్గాలను పరిశీలిస్తారు. మౌలిక వసతులు కల్పించి ప్రగతి పనులు చేపడితే బిచ్కుంద పట్టణం మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ముఖ్యంగా నిధుల కొరతతో ప్రగతి కుంటుపడుతోంది. పురపాలికగా మారితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యే అవకాశాలున్నాయి.

పంచాయతీ ఆర్థిక వివరాలు(రూ.లలో)

ఆర్థిక సం॥	ఆదాయం	వ్యయం
2020–21	2,43,09,328	2,11,65,782
2021–22	2,65,91,643	2,65,42,031
2022–23	1,66,65,942	1,48,67,173

భారాస హయాంలో అడుగులు

● భారాస ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే హన్మంత్‌షిండే చొరవతో బిచ్కుంద, పిట్లం పంచాయతీలను పురపాలికలుగా మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. పరిశీలించిన జిల్లా యంత్రాంగం బిచ్కుంద ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించింది. ఆ తర్వాత పట్టణాభివృద్ధి శాఖ చెందిన అధికారులు బృందం సైతం పర్యటించింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రతిపాదన ఆటకెక్కింది.

● ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సూచనలతో జిల్లా పంచాయతీ అధికారులు మరోసారి ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆమోదముద్ర వేసి దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపగా పట్టణాభివృద్ధి శాఖకు చేరింది. పురపాలికగా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు ఈనాడుకు వెల్లడించారు.

పునర్నిర్మాణ పనులు ప్రశంసనీయం

లింగంపేట, న్యూస్‌టుడే: భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా నాగన్న దిగుడు బావిలో చేపట్టిన పునర్నిర్మాణ పనులు ప్రశంసనీయమని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ సభ్యులు బెంజిమన్ కరుణాకరన్, ఏఎస్ పవార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాగన్న బావిని వారు పరిశీలించారు. పురాతన కట్టడాల పరిరక్షణకు అవలంబించిన విధానాలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాగన్న బావిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రూ.18.76 లక్షల నోట్లతో మహాలక్ష్మి అలంకరణ

ఎంద్రియల్(తాడ్వాయి), న్యూస్‌టుడే: మండలంలోని ఎంద్రియల్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను బుధవారం గ్రామస్థులు రూ.18.76 లక్షల నోట్లతో మహాలక్ష్మిగా అలంకరణ చేశారు. మండపాన్ని నగదుతో అందంగా ముస్తాబు చేశారు. మెడలో మణిహారం ఏర్పాటు చేశారు.





జుక్కల్‌లో ట్యాంకరు నీటిని పట్టుకుంటున్న జనం

పండగ పూట.. క'న్నీటి కష్టాలు'..!

నియోజకవర్గ వ్యాప్తంగా నిలిచిన భగీరథ సరఫరా
◆ నాలుగు రోజులుగా తిప్పలు

జుక్కల్, న్యూస్‌టుడే: దసరా పండగ వేళ జుక్కల్ నియోజకవర్గ ప్రజలు క'న్నీటి కష్టాలు' పడుతున్నారు. గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ జలాల సరఫరా నిలిచిపోవడంతో జనం నీటి కోసం అల్లాడుతున్నారు. కొన్ని గ్రామాల్లో స్థానిక బోరు మోటార్ల నుంచి ట్యాంకులకు నీరు ఎక్కించి సరఫరా చేస్తున్నారు. భగీరథ నీటినే నమ్ముకొన్న జనం ముప్పుతిప్పలు పడుతున్నారు. పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. ట్యాంకరు వద్ద జనం గుమిగూడడంతో మహిళల మధ్య ఘర్షణకు తావిస్తోంది. దసరా పండగకు ఇంటికొచ్చిన బంధువులకు మర్యాద చేయాల్సిన సమయమంతా నీటి కోసమే కేటాయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ పండగ మొక్కుబడిగా జరుపుకోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. జుక్కల్ నియోజకవర్గానికి సింగూరు నుంచి భగీరథ నీరు సరఫరా కావాల్సి ఉండగా.. అల్లాదుర్గం ప్రాంతంలో పైపులైను పగిలి సరఫరా నిలిచినట్లు సమాచారం. ఈ విషయమై 'న్యూస్‌టుడే' భగీరథ డీఈఈ కౌశిక్‌ను వివరణ కోరగా.. నియోజకవర్గ వ్యాప్తంగా భగీరథ నీటి సరఫరా నిలిచిన మాట వాస్తవమే. సింగూరు వద్ద పైపులైను సరిగా లేక సమస్య ఏర్పడింది. అక్కడ మరమ్మతు చేయించారు. నీటి సరఫరా ప్రారంభమై, ట్యాంకులకు నీరు అందుతోంది. గురువారం నాటికి ప్రజలకు భగీరథ నీళ్లు అందిస్తామని సమాధానమిచ్చారు.



పెద్దకొడప్‌గల్ : ట్యాంకు వద్ద గుమిగూడిన మహిళలు

'మాదిగ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షల్లో అన్యాయం'

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాదిగ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షల్లో అన్యాయం జరిగిందంటూ ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలుకాక ముందే డీఎస్సీ ఫలితాలు ప్రకటించడంతో మాదిగ అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కలేదని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండు నెలల క్రితం ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంతి పద్మారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటరమణ, మాచారెడ్డి మండలాధ్యక్షుడు రమేశ్, బాన్సువాడ అధ్యక్షుడు బాల్‌రాజు, లావణ్య, సురేశ్, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

చేతులెత్తేశారు

సన్న ధాన్యం మిల్లింగ్ చేయలేమని కలెక్టర్‌కు మిల్లర్ల లేఖ

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

మరికొద్ది రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం తొలిసారిగా సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడమే కాకుండా క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించింది. ఈ తరుణంలో సన్న ధాన్యం మిల్లింగ్ చేయలేమంటూ రైస్‌మిల్లర్లు జిల్లా పాలనాధికారికి లేఖ అందజేశారు. ఇప్పటికే అనేక రకాల సమస్యలు వేధిస్తున్నాయని పేర్కొన్నారు. తాజాగా సన్నధాన్యం మిల్లింగ్ చేయడం వల్ల తమకు నష్టాలు అధికంగా వస్తాయని లేఖలో వివరించారు. గత 10 సీజన్ల నుంచి సమస్యలు అలాగే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయడం లేదని రైస్‌మిల్లర్లు పేర్కొంటున్నారు.

67 శాతం బియ్యం ఎలా ఇచ్చేది..?

సాధారణంగా దొడ్డు రకానికి చెందిన క్వింటా ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 67-68 కిలోల బియ్యం వస్తాయని మిల్లర్లు పేర్కొంటున్నారు. అదే సన్నరకానికి చెందిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసినట్లయితే 57-58 కిలోల బియ్యం మాత్రమే వస్తాయంటున్నారు. ఇక్కడ సన్నాలు, దొడ్డు రకానికి చెందిన ఏ ధాన్యాన్ని మిల్లింగ్ చేసినా.. 67-68 కిలోల సీఎంఆర్ ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొంటోందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్నరకాలను తీసుకుని మిల్లింగ్ చేస్తే క్వింటాలుకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎక్కడి నుంచి పూడ్చాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం మిల్లింగ్ చేస్తే లక్షల రూపాయలు నష్టపోతామని పేర్కొంటున్నారు. సన్నరకానికి చెందిన ధాన్యాన్ని 17 శాతం తేమకు దిగుమతి చేసుకుంటే 15-20 రోజుల్లో ధాన్యం రంగు మారిపోతుందని తెలిపారు. ఇవే బియ్యాన్ని ఇచ్చినప్పుడు పౌరసరఫరాలశాఖ వారు అనేక కొర్రీలు పెడతారని వాపోయారు.

సమస్యలు అనేకం

మిల్లింగ్ ఛార్జీలు గత 20 ఏళ్లుగా పెంచడం లేదని మిల్లర్లు అంటున్నారు. క్వింటాలు రా రైస్‌కు రూ.30, బాయిల్డ్ రైస్‌కు రూ.15 చెల్లిస్తున్నారని తెలిపారు. అవి కూడా 2018 నుంచి మిల్లర్లకు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన చెందారు. ధాన్యానికి పాత సంచులు ఉపయోగించి బియ్యానికి కొత్తవి ఇప్పిస్తే క్రాప్రా పురుగు రాకుండా ఉంటుందని తెలిపారు. ఇతర మిల్లులకు ధాన్యం ఇచ్చినప్పుడు జిల్లా అసోసియేషన్ ఎలాంటి గ్యారంటీ ఇవ్వదని పేర్కొన్నారు.



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి లేఖ అందజేస్తున్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

టెస్ట్ మిల్లింగ్ చేయాలి

సన్న ధాన్యాన్ని టెస్ట్ మిల్లింగ్ చేయించాలి. దాని ప్రకారమే క్వింటాలుకు ఎన్ని కిలోల బియ్యం వస్తే అంత ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ముఖ్యంగా సన్న రకానికి చెందిన ధానాన్ని 14 శాతం తేమ వచ్చిన తర్వాతే కొనుగోలు చేయాలి. లేదంటే ధాన్యం, బియ్యం రంగు మారుతాయి. ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలి. **- రాజేంద్రప్రసాద్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**

నేడే సద్దుల బతుకమ్మ

కామారెడ్డి పట్టణం: జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబరాలను గురువారం నిర్వహించనున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సంబరాలు జరిపేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో పురపాలక యంత్రాంగం బతుకమ్మల నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లను ఛైర్‌పర్సన్ ఇందుప్రియ అధికారులతో కలిసి పర్యవేక్షించారు.



పనులను పర్యవేక్షిస్తున్న పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ



పూల పండగ.. గిరాకీ మెండుగ

సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో సందడి నెలకొంది. గునుగు పువ్వు, కాగితపు బతుకమ్మల కొనుగోళ్లకు ప్రజలు మార్కెట్‌కు వచ్చారు. సుభాశ్‌రోడ్డు, జేపీఎన్‌రోడ్డు, తిలక్‌రోడ్డు ప్రాంతాలు కిక్కిరిశాయి. **- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం**

దసరా తర్వాత వెబ్ ఆప్షన్లు

476 మందికి నియామక పత్రాల అందజేత

న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో దసరా తర్వాత నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు. మొత్తం 506 ఉపాధ్యాయ పోస్టులకు సర్కారు ప్రకటన విడుదల చేసినా 476 మంది అభ్యర్థులు నియామక పత్రాలు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి అభ్యర్థులు జిల్లాకేంద్రం నుంచి ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. డీఈవో రాజు, విద్యాశాఖ సమన్వయకర్తలు, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్నారు. వెల్లడైన తుది జాబితాలో స్కూల్ అసిస్టెంట్ 121కి 119, లాంగ్వేజ్ పండిత్ 15కి 13, పీఈటీ 5కి 5, ఎస్జీటీ 318కి 305, ఎస్ఏ(ప్రత్యేక విద్య) 11కి 0, ఎస్జీటీ(ప్రత్యేక విద్య) 36కి 34 భర్తీ అయినట్లు లెక్క చూపారు. దసరా తర్వాత వెబ్ ఆప్షన్లు అందుబాటులోకి తేనున్నారు.



బస్సు వద్ద అభ్యర్థులతో డీఈవో రాజు, విద్యాశాఖ అధికారులు

కొలువుదీరారు

ఏళ్ల కష్టం.. ఎన్నో ఓటములు.. కుటుంబ సభ్యుల త్యాగం.. సంవత్సరాల తరబడి నిరీక్షణ.. వెరసి చివరకు వారు ఇష్టంగా ఎంచుకున్న ఉపాధ్యాయ కొలువులు కొల్లగొట్టారు.. కొందరు చివరి ప్రయత్నంలో విజయం సాధిస్తే.. మరికొందరు ఆర్థిక కష్టాలకు ఎదురీది అనుకున్న లక్ష్యం చేరుకున్నారు.. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఉమ్మడి జిల్లా నుంచి అభ్యర్థులు నియామకపత్రాలు అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి 465 మంది, కామారెడ్డి జిల్లా నుంచి 443 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు.



☛ ఉమ్మడి జిల్లా డీఎస్సీ అభ్యర్థుల విజయగాథలు

● పేరు ◆ ఊరు ➡ సాధించిన ర్యాంకు ❖ మొత్తం మార్కులు ★ పోస్ట్ కేటగిరీ ✦ ఎన్నేళ్లుగా కష్టపడ్డారు ☛ సాధించిన తీరు

పోలీసు నుంచి బోధనవైపు

● కామసాని సౌజన్య ◆ రాజంపేట మండలకేంద్రం ➡ 420 ❖ 68.43 ★ ఎస్జీటీ ✦ ఆయిదేళ్లుగా ☛ 2020లో పోలీసు కానిస్టేబుల్‌గా మారా రెడ్డి రాజాలో విధులు నిర్వహిస్తున్నారు. అంతకుముందే డీఎడ్ పూర్తి చేశారు. ఉన్నతాధికారుల అనుమతితో రెండు నెలలు సెలవులు తీసుకొని డీఎస్సీకి సిద్ధమయ్యారు. భర్త నవీన్ ప్రోత్సాహంతో తనకిష్టమైన ఉద్యోగం సాధించారు. - కామారెడ్డి కలెక్టరేట్



ట్యూషన్లు చెబుతూ..

● తెప్పల శ్రీకాంత్ ◆ బీర్కూర్ మండలకేంద్రం ➡ 31 ❖ 80.13 ★ ఎస్జీటీ ✦ రెండేళ్లుగా ☛ కుటుంబ ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో ఒకవైపు ట్యూషన్లు చెబుతూ వచ్చిన డబ్బులతో కావాల్సిన మెటీరియల్ కొనుగోలు చేశారు. నిత్యం 6 గంటలు శ్రమించి కొలువు సాధించారు. - న్యూస్‌టుడే, బీర్కూర్



మూడు నెలల్లో రెండు..

● షిండే సచిన్ పాటిల్ ◆ గాంధారి మండలకేంద్రం ➡ జిల్లాస్థాయి మొదటి ర్యాంక్, ❖ 80.70/100 ★ ఓపెన్, స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం) ✦ నాలుగేళ్లుగా ☛ పేద కుటుంబం. 2000లో బీఈడీ పూర్తిచేసి పదేళ్లుగా ప్రైవేటులో బోధిస్తున్నారు. తానే సొంతంగా నోట్స్ రాసుకొని, దినపత్రికల్లో వచ్చిన విషయాలు అభ్యసనం చేశారు. మూడు నెలల కిందట గురుకుల టీజీటీ వచ్చింది. - న్యూస్‌టుడే, గాంధారి




ఉదయం విధులు.. రాత్రి చదువు

● మండాజీ శ్రీకాంత్ ◆ దూదేగాం, మెండోరా మండలం ➡ 18 ❖ 78.73 ★ ఎస్జీటీ ✦ రెండేళ్లుగా ☛ ఆర్టీసీ నిజామాబాద్- 1 డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకున్నారు. ఏదో అసంతృప్తి ఉండేది. నిత్యం విధుల నిర్వర్తిస్తూ.. అలసిపోయి ఇంటికొచ్చినా రాత్రిపూట తప్పక చదివేవారు. చివరికి తన కల సాకారం చేసుకున్నారు. - న్యూస్‌టుడే, బాల్కొండ



ఆయన విజయం వెనక ఆమె

● సత్యనారాయణ ◆ జాగిర్యాల్, భీమ్‌గల్ మండలం ➡ 8వ ❖ 72.07 ★ స్కూల్ అసిస్టెంట్ (సోషల్, ఓపెన్) ✦ మూడేళ్లుగా ☛ 2013-15లో డీఎడ్, 2019-21 బీఎడ్ పూర్తిచేశారు. 2018, 2023లో గురుకుల టీజీటీ ఉద్యోగం చేజారింది. ప్రేమ పెళ్లి చేసుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఆయన భార్య నాగశ్రీ ఓ ప్రైవేటు పాఠశాలలో బోధిస్తూ కుటుంబ పోషణ చూసుకునేది. ఆమె సహకారం ఆయనను విజయతీరాలకు చేర్చింది. - భీమ్‌గల్ గ్రామీణం



అన్నలే ఆదర్శంగా..

● ఆబ్బెంద్ ప్రతాప్‌గౌడ్ ◆ బాన్సువాడ పట్టణం ➡ 24 ❖ 81.37 ★ ఎస్జీటీ (తెలుగు) ✦ మూడేళ్లుగా ☛ ఇద్దరు అన్నలు ఉపాధ్యాయులు కావడంతో వారిని ఆదర్శంగా తీసుకొని సొంతంగా సన్నద్ధమయ్యారు. ఉత్తమ ర్యాంకు సాధించి ఆదర్శంగా నిలిచారు. - న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం



లాఠీ వదిలి.. పెన్ను పట్టి

● సాయిలు ◆ పెద్దకొడప్‌గల్ మండలకేంద్రం ➡ 23 ❖ 63.47 ★ స్కూల్ అసిస్టెంట్(భౌతిక శాస్త్రం) ✦ రెండేళ్లుగా ☛ రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. స్థితిగతులు మారాలంటే సర్కారు కొలువులు కొట్టాలని గట్టిగా నమ్మారు. 2019లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కానీ, తనకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తి పై మమకారం పెంచుకొని రెండేళ్లుగా పుస్తకాలతో కుస్తీ పట్టి చివరకు అనుకున్నది సాధించారు. - పెద్దకొడప్‌గల్



అమ్మ కల నెరవేరిన వేళ

● యోగేష్ ◆ బాన్సువాడ పట్టణం ➡ 132 ❖ 75.7 ★ ఎస్జీటీ ✦ రెండేళ్లుగా ☛ 2014లో డీఎడ్ పూర్తిచేశారు. ప్రైవేటు పాఠశాలలో బోధిస్తూ వీలు చిక్కినప్పుడల్లా గ్రంథాలయంలో చదువుకునేవారు. తండ్రి చనిపోవడంతో తల్లి కూలీ పనులకు వెళ్లి కుమారుడికి అండగా నిలవడంతో విజయతీరాలకు చేరారు. - న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం



చిన్నతనం నుంచి కుటుంబబాధ్యతలు మోస్తూ..

● న్యామతాబాద్ సంతోష్ ◆ బీబీపేట మండలకేంద్రం ➡ 2 ❖ 61.57 ★ స్కూల్ అసిస్టెంట్(హిందీ పండిత్) ✦ 8 ఏళ్లుగా ☛ పదేళ్ల వయస్సున్నపుడు సంతోష్ తండ్రి మరణించారు. అప్పటి నుంచే కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. ఉదయం బడికి వెళ్లి సాయంత్రం మామిడి దుకాణం నడిపే వారు. 2017లో 1:3 నిష్పత్తిలో ఎంపికైనా ఉద్యోగం రాలేదు. అయినప్పటికీ ఏమాత్రం నిరాశ చెందకుండా మరింత సాధన చేసి కొలువు సాధించారు. - న్యూస్‌టుడే, బీబీపేట



20 ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలలో..

● పన్యాల జ్యోతి ◆ దోమకొండ మండలకేంద్రం ➡ 18 ❖ 69.23 ★ స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ✦ రెండేళ్ల నుంచి ☛ 20 ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలలో బోధిస్తూ నిర్వహణ చూసుకున్నారు. ఆమెకు 43 ఏళ్లు. ఆఖరు నిమిషంలో ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం సాధించింది. గత నెలలో జ్యోతిబా పులే గురుకుల ఉపాధ్యాయురాలిగా ఎంపిక కాగా.. ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. - న్యూస్‌టుడే, దోమకొండ



ఎనిమిదో ప్రయత్నంలో వరించెన్

● ఉపాకిరణ్ రాజు ◆ దుబ్బ, నిజామాబాద్ ➡ 18 ❖ 68.80 ★ స్కూల్ అసిస్టెంట్, సామాజికశాస్త్రం ✦ నిజామాబాద్ గంజ్‌లో తండ్రి హమాలీ పనిచేస్తూ చదివించారు. 2018 డీఎస్సీలో 1:2 నిష్పత్తి జాబితాలో ఉన్నా ఉద్యోగం రాలేదు. 2022లో కేంద్రీయ విద్యాలయం పీఆర్టీ ఉద్యోగం రెండు మార్కులు, టీజీటీ ఒక మార్కుతో దూరమైంది. 2023లో ఏకలవ్య గురుకులంలో టీజీటీ 0.25 మార్కులు, గురుకుల టీజీటీ 0.3 మార్కులతో చేజారింది. 2023 గ్రూప్-4లో 1:2 నిష్పత్తి, టీఎస్‌ట్రాన్స్‌కోలో 1:3 నిష్పత్తికి అర్హత సాధించినా ఉద్యోగం రాలేదు. ఏడుసార్లు త్రుటిలో తప్పినా కుంగిపోకుండా ఈ సారి కష్టపడి కొలువు పట్టారు. - నిజామాబాద్ విద్యావిభాగం



గొర్ల కాపరి.. గురువుగా మారి

● కోరే కుమార్ ◆ భిక్కనూరు ➡ 12 ❖ 70.93 ★ స్కూల్ అసిస్టెంట్(సాంఘిక శాస్త్రం) ✦ 5వ తరగతి వరకు చదివి, ఆర్థిక పరిస్థితులు బాగోలేక మానేసి గొర్ల కాపరిగా మారారు. 10వ తరగతి ప్రైవేటులో పరీక్ష రాసి పాసయ్యారు. ఇంటిలో సీఈసీ, గొర్లు కాస్తూ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత పీజీ నిజాం కాళాశాలలో, ఆ తర్వాత బీఈడీ పూర్తి చేశారు. పీజీ చేసే సమయంలో ఎస్జీ గ్రూప్స్‌కు సన్నద్ధం కావడంతో అది డీఎస్సీకి ఉపయోగపడింది. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా.. గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతానని కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, భిక్కనూరు





నిజామాబాద్ నుంచి బస్సులో హైదరాబాద్ బయలుదేరిన డీఎస్సీ-2024 అభ్యర్థులు

రెండు దశాబ్దాల నిరీక్షణ

● బండి రాజులు ◆ గాంధారి మండల కేంద్రం ➡ జిల్లాస్థాయిలో 19వ ర్యాంక్, బీసీ-బీలో 2వ ర్యాంక్ ❖ 69.33 ★ బీసీ-బీ ✦ 20 ☛ 2001లో అర్థశాస్త్రంలో పీజీ, 2004లో బీఈడీ (సాంఘిక) పూర్తి చేశారు. 19 ఏళ్లపాటు ప్రైవేటు స్కూల్ నడిపారు. తర్వాత హైదరాబాద్‌లో ఓ పాఠశాలలో బోధిస్తున్నారు. పలు పోటీ పరీక్షలతో పాటు గత డీఎస్సీల్లో ఒకటి, అర మార్కుల తేడాతో, 1:2 నిష్పత్తిలో ఉద్యోగాలు కోల్పోయారు. అయినా పట్టు వీడకుండా చివరి ప్రయత్నంలో ఉపాధ్యాయ కొలువు సాధించారు. - న్యూస్‌టుడే, గాంధారి



సూటిపోటి మాటలు తట్టుకొని..

● ఎల్. నిశిత ◆ సారంగాపూర్, నిజామాబాద్ గ్రామీణ మండలం ➡ 61 ❖ 74.90 ★ ఎస్జీటీ ✦ అమ్మానాన్న, భర్త ప్రోత్సాహంతో ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్దే సిద్ధమయ్యారు. బంధువుల సూటిపోటి మాటలు తట్టుకుంటూనే ప్రైవేటులో బోధిస్తూ చివరకు విజయం సాధించారు. - నిజామాబాద్ విద్యావిభాగం



నాడు కానిస్టేబుల్.. నేడు ఉపాధ్యాయురాలు

● ఎం. సౌమ్య ◆ రావుట్ల, సిరికొండ ➡ 100 ❖ 73.03 ★ ఓపెన్ కేటగిరీ ✦ రెండేళ్లుగా ☛ గతేడాది అక్టోబరులో భర్త సుమన్ సహకారంతో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఉపాధ్యాయురాలు కావాలనే లక్ష్యంతో మరింత కష్టపడి చదివి ఎస్జీటీ సాధించారు. ఏడాదిలోపే రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. - న్యూస్‌టుడే, సిరికొండ



నాలిగింటిని వదులుకొని..

● సంత రాధిక ◆ హసాకొత్తూరు, కమ్మర్‌పల్లి (ప్రస్తుతం నిజామాబాద్‌లో ఉంటున్నారు) ➡ 6 ❖ 77.07 ★ స్కూల్ అసిస్టెంట్(గణితం) ✦ 8 ఏళ్లుగా ☛ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రాధిక చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి నర్సు అన్నీ తానై చదివించారు. బీఈడీ పూర్తికాగానే పెళ్లికావడంతో చదవడం ఇబ్బందైంది. అటు కుటుంబ పోషణ ఇటు చదువు రెండింటిని కొనసాగించారు. పంచాయతీ కార్యదర్శి, వసతి గృహ సంక్షేమాధికారి (గ్రేడ్-2, గ్రూప్-4 ఉద్యోగాలు సాధించినా బోధనపై మమకారంతో డీఎస్సీలో విజయం సాధించారు. - న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ



కుటుంబికుల సాయం.. కల సాకారం

● న్యామ్తాబాద్ పూజితరాజ్ ◆ స్టేషన్ ఏరియా, డిచ్‌పల్లి మండలం ➡ 116 ❖ 72.53 ★ ఎస్జీటీ ✦ ఆరేళ్లుగా ☛ నాలుగో తరగతిలో ఉన్నప్పుడే తండ్రి మృతి చెందారు. ఇద్దరు బాబాయిలు, నానమ్మ అండగా నిలబడి చదివించారు. 2015లో డీఎడ్ పూర్తి చేసి పరీక్షకు సన్నద్ధమయ్యారు. పెళ్లైనా భర్త సహకారంతో చదివారు. గురుకులంలో పీజీటీ పోస్టుకు ఎంపికైనా చివరి క్షణంలో ఉద్యోగం చేజారింది. ఈ సారి మరింత పట్టుదలతో చదివి ఉద్యోగం కొట్టారు. - నిజామాబాద్ అర్బన్



మెకానిక్ భర్త ప్రోత్సాహం

● మంగళిపల్లి రోహిణి ◆ గుండారం, రాజంపేట మండలం ➡ 57 ❖ 78.57 ★ ఎస్జీటీ ✦ 12 ఏళ్లుగా ☛ భర్త పురుషోత్తం కామారెడ్డిలో ద్విచక్రవాహన మెకానిక్. భర్త ప్రోత్సాహంతో 2012 నుంచి సన్నద్ధమవుతున్నారు. 2012, 2017 డీఎస్సీలో కొద్ది తేడాతో విఫలమయ్యారు. 12 ఏళ్లుగా అవనిగడ్డ, మెదక్, కామారెడ్డి తదితర చోట్ల ప్రైవేటు సంస్థల్లో ఫ్యాకల్టీగా పనిచేశారు. ఈసారి ప్రణాళికతో చదివి కొలువు సాధించారు. - న్యూస్‌టుడే, రాజంపేట



కూరగాయలు విక్రయిస్తూ..

● జి.రవి ◆ పెద్దవాల్గోట్, సిరికొండ ➡ 84 ❖ 73.73 ★ ఓపెన్ ఎస్జీటీ ✦ 12 ఏళ్లుగా.. ☛ 2014లో డీఎస్సీ, 2023లో కానిస్టేబుల్ పరీక్షల్లో కొద్ది మార్కుల తేడాతో అవకాశం కోల్పోయినా అధైర్యపడలేదు. కుటుంబ పోషణకు ఒకవైపు కూరగాయలు విక్రయిస్తూనే.. మరోవైపు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ సాధించారు. తన 12 ఏళ్ల కష్టానికి ప్రతిఫలం దక్కింది. - న్యూస్‌టుడే, సిరికొండ



దుబాయికి వెళ్లిపోమన్నారు

● తోట మహేష్ ◆ అమీర్‌నగర్, మండలం: కమ్మర్‌పల్లి ➡ 4 ❖ 81.97 ★ ఎస్జీటీ ☛ 2013లో డీఎడ్ పూర్తయింది. కష్టపడి చదివినా 2018 డీఎస్సీ మిస్సయింది. వ్యవసాయ పనులు చేసుకుంటూనే 9 పోటీ పరీక్షలు రాసినా ఎందులోనూ ఫలితం రాలేదు. బంధువులు, స్నేహితులు నీకు ఉద్యోగం రాదు దుబాయి వెళ్లిపోమన్నారు. ఈ సారి తల్లిదండ్రుల సహకారంతో మరింత కష్టపడి ఉద్యోగం సాధించా. - న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం



మంజీరలోకి 5 వేల క్యూసెక్కులు

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 5,000 క్యూసెక్కుల వరద వచ్చినట్లు జలవనరుల శాఖ ఏఈఈ శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలవిద్యుత్తు కేంద్రం సమీపంలోని గేట్ల ద్వారా 1000 క్యూసెక్కులు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి, ప్రాజెక్టు ప్రధాన వరద గేట్ల నుంచి 4,000 క్యూసెక్కులు మంజీరలోకి విడుదల చేసినట్లు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404 అడుగుల (17.687 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.





జనగామలో విద్యుద్దీపాలంకరణలో దుర్గామాత



ఆలయాన్ని తలపించేలా భారీ సెట్టింగ్

కోవెలలో.. దుర్గాభవాని

దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీబీపేట మండలం జనగామ గ్రామంలో సుమారు రూ.12 లక్షల ఖర్చుతో ఆలయాన్ని తలపించేలా భారీ సెట్టింగ్ వేశారు. దాతల సాకారం, గ్రామస్థుల అండతో వేదలం ఉత్సవాలు జరుపుతున్నారు. సుమారు 50 మందికి పైగా భక్తులు భవానీ మాలలు వేసి నిత్యం పూజలు చేస్తున్నారు. రాత్రి వేళలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించడానికి ఆయా మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. - న్యూస్‌టుడే, బీబీపేట



కామారెడ్డిలో సమావేశమైన ప్రతినిధులు

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో నష్టం'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతో ఇతర వర్గాలకు చెందిన అభ్యర్థులకు నష్టం వాటిల్లిందని వక్తలు అభిప్రాయపడ్డారు. కామారెడ్డిలో బుధవారం ఆయా పక్షాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా అగ్రవర్ణ పేదలకు 10 శాతం ప్రయోజనం అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదన్నారు. బీవీఎస్ రాష్ట్ర నాయకుడు విఠల్, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల బాబు, బామ్‌సెఫ్ రాష్ట్ర కార్యదర్శి నరేందర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సిద్ధి రాములు, ప్రతినిధులు తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తాడ్వాయి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు పొందే విషయంలో లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకే ఇంటికెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ రహమతుల్లా, ఎంపీడీవో సంగ్రాంసెట్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగం నరేందర్, శ్యాంరావు, జలంధర్‌రెడ్డి, సుధాకర్‌రావు, సంజీవులు, అఖిల్‌రావు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మద్నూర్, న్యూస్‌టుడే: గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మద్నూర్ తహసీల్ కార్యాలయంలో గుర్తింపు పొందిన ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. 2021 అక్టోబరు 31వ తేదీకి ముందు డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. టీచర్స్ ఎమ్మెల్సీకి 2021 అక్టోబరు 31 నాటికి ఉపాధ్యాయ వృత్తి మూడేళ్లు పూర్తి చేసి ఉండాలని తెలిపారు. తహసీల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఓటరు నమోదు కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంట తహసీల్దార్ ముజీబ్ తదితరులు ఉన్నారు.



ఓటరు నమోదు పత్రాన్ని చూపిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఏబీసీ నిర్మాణానికి స్థల పరిశీలన

బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే: జంతు జనన నియంత్రణ కేంద్రం (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్, ఏబీసీ) నిర్మాణానికి కసరత్తు చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బిచ్కుంద మండలం గోపన్‌పల్లి శివారులో ప్రభుత్వ భూమిని పరిశీలించిన తర్వాత అధికారులతో మాట్లాడారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బిచ్కుందలో ఏబీసీ నిర్మాణంతో వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ ఇంజక్షన్ వేయడంతో పాటు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో పశువైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి వీధి కుక్కలను ఇదే కేంద్రానికి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేసి, ప్రారంభించామని, ఇప్పుడు బిచ్కుందలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వెంట డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో అబ్బాగౌడ్, ఆర్‌ఐ రవీందర్, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కాన్షీ రాంకు నివాళి

బీబీపేట, న్యూస్‌టుడే: కాన్షీరాం వర్ధంతి సందర్భంగా బుధవారం తుజాల్పూర్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు నరేశ్, రమేశ్‌గౌడ్, తలారి రమేశ్, గోప రాజు, భాస్కర్, సుధాకర్, బాబు, కిశోర్, రమేశ్, దావీద్ తదితరులు పాల్గొన్నారు.



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242



జిల్లాకేంద్రంలోని గొల్లవాడలో మురుగుకాల్వకి ఇరువైపులా గడ్డి పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- స్వామి, గొల్లవాడ**

సిబ్బందికి ఆదేశాలిచ్చి గడ్డి తొలగించాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



జిల్లాకేంద్రంలోని వికాస్‌నగర్‌లో కాల్వ పూడిక పేరుకుపోయింది. **- సంజయ్, వికాస్‌నగర్**

కాల్వ పూడిక తొలగించేలా చర్యలు చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

జిల్లాకేంద్రంలోని అజంపురలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- అన్వర్, అజంపుర**



ఫిర్యాదు మేరకు వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



స్పందన: పట్టణంలోని ప్రధాన రహదారిపై పలు చోట్ల వీధి దీపాలు వెలగకపోవడంపై స్థానికుడురాహుల్ ఈనాడు దృష్టికి తేగా ఈఈఎస్ఎల్ పట్టణ పర్యవేక్షకుడు సాయికిరణ్ స్పందించి సమస్య పరిష్కరింపజేశారు.

అంచనూరులో పాఠశాల వెనుక వైపు కాలనీలో వీధి దీపాల లైన్ లేదు. **- భగవాన్, అంచనూరు**

పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి, అంచనూరు**

మండల కేంద్రంలోని పెద్దమ్మగుడి, వీక్లీ మార్కెట్ సమీపంలో రజక సంఘం భవనం ఎదురుగా ఉన్న బోరు నుంచి నిత్యం నీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. **-- చాకలి శ్రీనివాస్, గాంధారి**

పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం **- నాగరాజు, పంచాయతీ కార్యదర్శి**

రామారెడ్డి మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన చెత్తను వేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. **సుధాకర్, గ్రామస్థుడు.**

రోడ్డు పక్కన చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. సమస్యను పరిష్కరిస్తాను. **క్రాంతి, పంచాయతీ కార్యదర్శి.**

పిట్లం మండల కేంద్రంలోని వారాంతపు సంత పరిసరాలు గుంతలుగా మారాయి. **అసిఫ్, స్థానికుడు**

మొరం వేయించి చదునుచేసేందుకు చర్యలు చేపడతాం. **యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.**

- న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం,బాన్సువాడ పట్టణం, దోమకొండ,గాంధారి, రామారెడ్డి, పిట్లం

బిచ్కుంద,: బిచ్కుంద పోలీస్ స్టేషన్ చౌరస్తాలో విద్యుత్తు దీపాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని మహేష్ అనే యువకుడు 'మేమున్నాం మీకు తోడుగా'కు



ఫిర్యాదు చేశాడు. న్యూస్‌టుడే పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన హైమాస్టు దీపాలను ఏర్పాటు చేయించారు.



తుంకిపల్లి(మహ్మద్‌నగర్), న్యూస్‌టుడే: మహ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గేటు వద్ద విద్యుత్తు స్తంభానికి చెట్ల తీగలు పారడంతో ప్రమాదకరంగా మారినట్లు నరేష్ ఈనాడు దృష్టికి తీసుకువచ్చారు. ఏఈ లక్ష్మణ్ స్పందించి సిబ్బంది చేత తీగలను తొలగించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

న్యూస్‌టుడే ,ఎల్లారెడ్డి

తాగునీటి సమస్యతో సతమతమవుతున్న నగరాలు, పట్టణాలపై కేంద్రం 'అమృత' జల్లులు కురిపిస్తోంది. రాష్ట్రంలో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న నగరపాలికలు, పురపాలికలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. అమృత్ 2.0 పథకానికి ఎల్లారెడ్డి బల్దియా ఎన్నికవడంతో తాగునీటి సమస్య తీరనుంది. ఈ పథకం కింద రూ. 35కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తవడంతో త్వరలోనే పనులు ప్రారంభమవనున్నాయి. ఈ నిధులతో రాబోయే మూడు దశాబ్దాలకు సరిపడేలా పనులు చేపట్టనున్నారు.

విలీన గ్రామాల్లో ..

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత దేవునిపల్లి, గండిమాసానిపేట, లింగారెడ్డిపేట, కొత్తపల్లి, బాలాజీనగర్ తండా, ఒడ్డెగుడిసె, పోసానిపల్లి గ్రామాలు విలీనమయ్యాయి. డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. అమృత పథకంతో వారి సమస్యలు తీరనున్నాయి.

స్వరూపం

మున్సిపాలిటీ పరిధిలో 25వేల పైబడి జనాభా ఉంది. 4772 గృహాలు ఉన్నాయి. విలీన గ్రామాలను కలుపుకొని 19 నీటి ట్యాంకులు ఉన్నాయి. సుమారు 35 కి.మీ. మేర పైపులైను ఏర్పాటు చేశారు. బల్దియా పరిధిలో కొత్తగా వెలుస్తోన్న వెంచర్ల వల్ల నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. వెంచరుదారులే ప్రతి ఇంటికి నీటి సౌకర్యం కల్పించాల్సి ఉండగా ఆ దిశగా వసతులు కల్పించట్లేదని పురప్రజలు పేర్కొంటున్నారు.



అమృత్ 2.0 పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చేపట్టబోయే పనులు

నూతనంగా తొమ్మిది , ఎనిమిది, ఐదు, రెండు లక్షల సామర్థ్యం గల నాలుగు ట్యాంకులను కొత్తగా నిర్మించనున్నారు. ఇంటింటికి నీటి సరఫరా చేసేందుకు కొత్తగా పైపులైను వేయనున్నారు. రెండు వేలకు పైగా నల్లా కనక్షన్లు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ పనులు పూర్తయితే ప్రజలకు రక్షిత నీటి సరఫరా కానుంది. తద్వారా వేసవిలో పానీపాట్లు, ప్రజల మధ్య జగడాలను నివారించవచ్చు.

టెండర్ల ప్రక్రియ పూర్తి

- శ్రీహరి రాజు, కమిషనర్, ఎల్లారెడ్డి

అమృత్ 2.0 పథకం పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

అధిక మొత్తంలో నిధులు మంజూరు

- మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్యే, ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ. 35 కోట్లతో అమృత్ 2.0 పథకం ద్వారా నీటిసరఫరా పనులకు శంకుస్థాపన చేశాం. ఇంటింటికి నల్లా కనక్షన్ ఇవ్వడంతో భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి అత్యధికంగా నిధులు మంజూరయ్యాయి.

కొమ్మల తొలగింపు





జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికను చెట్ల కొమ్మలు కప్పేశాయి. దీంతో ఈనాడులో బుధవారం 'చెట్ల కొమ్మల్లో నియంత్రిక' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు సిబ్బంది చెట్ల కొమ్మలు, పొదలను పూర్తిగా తొలగించారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

బాధితులకు న్యాయం అందించాలి: ఎస్పీ

రాజంపేట: బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ సింధూశర్మ పోలీసులకు సూచించారు. బుధవారం రాజంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. డయల్ 100, సైబర్ మోసాలు, నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వెంట డీఎస్పీ నాగేశ్వరరావు, భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, రాజంపేట ఎస్సై పుష్పరాజ్, సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: మాచారెడ్డి ఠాణాలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ రామన్ అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని జిల్లా ఎస్పీ సింధూశర్మ పేర్కొన్నారు. రామన్ 1992లో నియామకమై పోలీసు శాఖకు సేవలు చేశారని ఆమె కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆయన బుధవారం తుది శ్వాస విడిచారన్నారు. రామన్ కుటుంబానికి ఆమె రూ.20 వేల ఆర్థిక సాయం అందించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



తాండూరులో ...



కామారెడ్డి పెద్దబజార్‌లో ..



బీబీపేటలో అన్నదానం



కామారెడ్డి: డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి అర్చనలు

జిల్లాలోని దుర్గా మండపాల్లో బుధవారం అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో భక్తులు నిమగ్నమయ్యారు. అన్నదానాలు చేశారు. సరస్వతీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే బృందం



జిల్లాకేంద్రంలో



కామారెడ్డి: గోదాంరోడ్డులో ..



బీర్కూర్‌లో..



బాన్సువాడ పట్టణం: పల్లకీసేవలో ఎమ్మెల్యే పోచారం



గాంధారి: చిన్నారికి కుమారి పూజ



మాగిలో చిన్నారులకు అక్షరాభ్యాసం



బాన్సువాడ పట్టణంలో ...



మార్దండలో ..



నస్రుల్లాబాద్ : మిర్జాపూర్‌లో..



అడ్లూర్ ఎల్లారెడ్డిలో ...



రెడ్డిపేట్‌లో ..



ఎల్లారెడ్డి : పూజల్లో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసులు



దోమకొండలో..



దేమికలాన్‌లో ..



దోమకొండ: ముత్యంపేటలో..



తాడ్వాయిలో..



రథం బహూకరణ

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోట దుర్గాదేవి ఆలయానికి బాసం వెంకటలక్ష్మి, కాశీనాథ్, అనురాధ సంతోష్, శ్వేత నందు దంపతులు రూ.లక్ష విలువ చేసే రథాన్ని ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. సభ్యులు దాతలను సత్కరించారు. ప్రతినిధులు శ్రీకాంత్, లింగం ఉన్నారు.

టోర్నీ విజేత మిర్జాపూర్

బీర్కూర్: వీరాపూర్‌లో మిర్జాపూర్ సొసైటీ ఛైర్మన్ వెన్నం రాంబాబు ఆధ్వర్యంలో ప్రారంభించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ బుధవారం ముగిసింది. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన 14 జట్లు పాల్గొన్నాయి. విజేతగా మిర్జాపూర్ సీ జట్టు గెలుపొంది రూ. 15,111 నగదు బహుమతి అందుకుంది. మిర్జాపూర్ ఏ టీం ద్వితీయ స్థానంలో నిలిచింది. సొసైటీ ఛైర్మన్ వెన్నం రాంబాబు, ఎస్సై రాజశేఖర్ విజేతలకు బహుమతులు అందజేశారు. నస్రుల్లాబాద్ ఏఎస్సై వెంకట్‌రావు, నిర్వాహకులు భాస్కర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

భాజపా నాయకుల సంబరాలు

బీర్కూర్, న్యూస్‌టుడే: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా గెలుపొందడంపై బీర్కూర్ కామప్ప కూడలి వద్ద ఆ పార్టీ నాయకులు బుధవారం గెలుపు సంబరాలు నిర్వహించారు. బీరుగొండ, బస్వరాజ్, సాయిబాబా తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న సభ్యులు

జివాజీ మహలే ఆదర్శప్రాయుడు

జుక్కల్: మహారాష్ట్రకు చెందిన జివాజీ మహలే ప్రాచీనుడు.. పౌరుషుడు.. విధేయుడు.. ఆదర్శప్రాయుడని ఛత్రపతి షాహురాజా కీర్తించారని నాయీబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు యాదవ్‌రావు సజ్జన్‌వార్ అన్నారు. శివాజీ అంగరక్షకుడైన జివాజీ మహలే జయంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంలో జరుపుకొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కులకర్ణి కృష్ణ, విజయ్ పటేల్, శివకుమార్, ప్రకాష్, సాయినాథ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా...'

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: దిల్లీ పెద్దలు ఇచ్చిన మాటకు కట్టుబడి నాకిచ్చిన బాధ్యతను నెరవేరుస్తానని, స్థానిక నాయకులు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోనని జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఛైర్మన్ సౌదగార్ అరవింద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తప్పుడు సమాచారం పొందుపరచి ఒక లేఖను విడుదల చేయడం హాస్యాస్పదమని అన్నారు. వెంట నిజాంసాగర్ మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు సంగమేశ్వర్ తదితరులుటున్నారు.



కలెక్టరేట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాలనాధికారి



కామారెడ్డి సఖీ కేంద్రం ఆధ్వర్యంలో..



జిల్లాకేంద్రంలో రాజీవ్‌నగర్ కాలనీలో

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



పెద్దకొడప్‌గల్‌లో...

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను పేర్చి గ్రామాల్లో, ప్రధాన కూడళ్లలో ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. సద్దులు ఆరగించారు. గురువారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. **-న్యూస్‌టుడే బృందం**



దోంగ్లీలో బతుకమ్మలను ఎత్తుకున్న తహసీల్దార్, సీడీపీవో



బాన్సువాడ : సంబరాల్లో పాల్గొన్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

అభివృద్ధి పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా నూతన బోరుబావుల్లో మోటార్లు బిగించి బుధవారం ప్రారంభోత్సవం చేసినట్లు ఛైర్మన్ పద్మ శ్రీకాంత్ తెలిపారు. దెబ్బతిన్న హైమాస్ట్ దీపాల స్థానంలో కొత్తవి బిగించామన్నారు. పలు కాలనీల్లో సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజితను ఛైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు నీలకంఠం, నాయకులు శ్రీనివాస్, విద్యాసాగర్, తిరుపతి, పోచయ్య తదితరులున్నారు.



బోరుమోటారు ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ శ్రీకాంత్

నూతన వస్త్రాల అందజేత

బీబీపేట: యాడారం గ్రామానికి చెందిన ధర్మగారి కుమారస్వామిగౌడ్ బుధవారం గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు, ఇతర రాష్ట్రానికి చెందిన పలువురికి నూతన వస్త్రాలు అందజేశారు.

పండగకు వస్తూ...మృత్యు ఒడికి ...



రవి

పిట్లం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన బుధవారం పిట్లం మండలం గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు, తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం...సిద్దాపూర్ తండాకు చెందిన కెతావత్ రవి(37) ఏడాది కిందట ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. తండాలో గురువారం అందరూ కలిసి దసరా పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో గద్దగుండు తండా సమీపానికి రాగానే 161వ నెంబరు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో తండాలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

సదాశివనగర్, న్యూస్‌టుడే : జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన సదాశివనగర్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై గంగాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం...జోగిన రాజు(49) తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ నెల 7వ తేదీన ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఊరి చివర పొలాల్లో ఉరేసుకొని చనిపోవడంతో గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పల్వంచలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన రాజనర్సు, పోచయ్య ద్విచక్రవాహనంపై కామారెడ్డి వైపునకు వెళ్తుండగా ఎదురుగా ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పట్టుబడిన దొంగలు

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: పోచారం గ్రామంలో ద్విచక్ర వాహనాలను దొంగిలించేందుకు యత్నించిన ముగ్గురిని బుధవారం ఉదయం గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. మాల్తుమ్మెద గ్రామానికి చెందిన వీరు మంగళవారం రాత్రి పోచారం గ్రామంలో రెండు ద్విచక్ర వాహనాలను దొంగిలించి వాటిని సమీపంలో దాచి ఉంచారు. మరో వాహనాన్ని దొంగిలించే క్రమంలో స్థానికులకు చిక్కారు. వారిని పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్థులు తెలిపారు.

జూదరుల అరెస్టు

లింగంపేట, న్యూస్‌టుడే: మండలంలోని శట్పల్లిసంగారెడ్డి శివారులో గల అటవీ ప్రాంతంలోని జూదస్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకోగా మరో నలుగురు పరారయ్యారు. వారి నుంచి రూ. 7700 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఐదు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు. దాడిలో సిబ్బంది రాజు, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో చోరీ

బాన్సువాడ, న్యూస్‌టుడే: బాన్సువాడలో దొంగతనం జరిగింది. బాధితులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పట్టణంలోని బండగల్లీకి చెందిన సమీ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. బుధవారం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. బీరువాలోని తులంన్నర బంగారం గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.